చేవెళ్ల అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తా : రంజిత్‌రెడ్డి

మొయినాబాద్ రూరల్, మే7(ఆంధ్రజ్యోతి): చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గం అభివృద్ధికి కట్టుబడి పని చేస్తానని.. గతంలో ఎంపీగా పని చేసిన తాను ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. మంగళవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన చేవెళ్ల అసెంబ్లీ ఇన్‌చార్జి పామెన భీంభరత్ సమక్షంలో మండల పరిధిలోని చిలుకూరు గ్రామంలో ఇంటింటికి తిరిగి కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా రంజిత్‌రెడ్డి మాట్లాడుతూ.. గతంలో చేవెళ్ల ఎంపీగా పనిచేసిన తాను ఎంతో అభివృద్ధి చేశానని, ఈ ప్రాంత అభివృద్ధి కోసమే కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు తెలిపారు. ప్రజలు తనను ఆశీర్వదించాలని కోరారు.

చిలుకూరులో ప్రత్యేక పూజలు

చిలుకూరు బాలాజీ వేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో తన గెలుపు ఖాయమని రంజిత్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం చిలుకూరు బాలాజీ దేవాలయంలో వేంకటేశ్వరస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు దర్శన్, మండల పార్టీ అధ్యక్షుడు తమ్మలి మాణెయ్య, సర్పంచ్‌ల సంఘం మాజీ మండలాధ్యక్షుడు కోట్ల నరోత్తంరెడ్డి, తోలుకట్ట మాజీ సర్పంచ్ శ్రీనివాస్ ముదిరాజ్, చిలుకూరు మాజీ సర్పంచ్ ఆంద్ర్యూ, మాజీ ఉప సర్పంచ్ ఆంద్ర్యూ, పీఏసీఎస్ ఛైర్మన్ చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైఎస్ఆర్‌సీపీ మండల మాజీ అధ్యక్షుడు మందడి వెంకట్‌రెడ్డి, పెద్దమంగళారం మల్లారెడ్డి, బొక్క దాన్‌రెడ్డి, రాజులు రంజిత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు.


చిలుకూరులో ప్రచారం చేస్తున్న రంజిత్‌రెడ్డి

తండ్రి కోసం తనయుడి ప్రచారం

ఎల్‌బీనగర్: చేవెళ్ల నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న రంజిత్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ ఆర్‌కేపురం డివిజన్ ఎన్టీఆర్‌నగర్‌లో ఆయన తనయుడు ఆర్యన్‌రెడ్డి మంగళవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. టీపీసీసీ ప్రతినిధి దేప భాస్కర్‌రెడ్డి, యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు చిలుక ఉపేందర్‌రెడ్డి, జ్ఞానేశ్వర్‌యాదవ్, రాజునాయక్, అక్బర్, కల్యాణ్, మాజీ కౌన్సిలర్ డకియార్ నాయక్ పాల్గొన్నారు.

కుటుంబ సభ్యులు..

మియాపూర్: రంజిత్‌రెడ్డి కుటుంబసభ్యులు ప్రచారం ముమ్మరం చేశారు. ఆయన గెలుపు కోసం రంజిత్‌రెడ్డి సతీమణి సీతారంజిత్‌రెడ్డి, కుమారుడు ఆర్యన్‌రెడ్డి, కూతురు పూజారెడ్డి, అల్లుడు రాజేష్‌రెడ్డి, కుటుంబసభ్యులు మంజుల , ప్రత్యూశలు మంగళవారం శేరిలింగంపల్లిలోని పలు గేటెడ్ కమ్యూనిటీ వాసులను కలిసి హస్తం గుర్తుకు ఓటువేసి రంజిత్‌రెడ్డిని గెలిపించాలని కోరారు.

బడంగ్‌పేట్‌లో మేయర్ ప్రచారం

సరూర్‌నగర్: చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డికి మద్దతుగా టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, బడంగ్‌పేట్ మేయర్ చిగిరింత పారిజాతారెడ్డి సోమవారం రాత్రి బడంగ్‌పేట్ కార్పొరేషన్ మామిడిపల్లిలో ప్రచారం నిర్వహించారు. హస్తం గుర్తుకు ఓటువేసి రంజిత్‌రెడ్డిని గెలిపించాలని కోరారు.


గేటెడ్ కమ్యూనిటీలో ప్రచారం చేస్తున్న రంజిత్‌రెడ్డి కుటుంబసభ్యులు


ఎన్టీఆర్‌నగర్‌లో ప్రచారం చేస్తున్న ఆర్యన్‌రెడ్డి

గెలిపించండి.. మల్కాజిగిరిని అభివృద్ధి చేస్తా

బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి

వనస్థలిపురం/చాదర్‌ఘాట్, మే 7 (ఆంధ్రజ్యోతి): తనను గెలిపిస్తే మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మన్సూరాబాద్ డివిజన్‌లో ఓ ఫంక్షన్ హాల్లో పలు కాలనీల సంక్షేమ సంఘాలు, అపార్ట్‌మెంట్ ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయనతోపాటు ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రాన్ని బీఆర్ఎస్ అభివృద్ధి చేసిందన్నారు. ఆరు గ్యారెంటీలు అమలు చేశామని కాంగ్రెస్ నాయకులు అబద్ధాలు చెబుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ మహిళలకు ఇస్తామన్న రూ. 2, 500, తులం బంగారం, వృద్ధులకు రూ. 4 వేల పింఛన్, రైతులకు రూ. 500 బోనస్ ఇవ్వలేదన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్ రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు జక్కిడి మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు. రాగిడి లక్ష్మారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం ఉదయం బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ రాజీవ్‌గాంధీ పార్క్‌లో వాకర్స్‌ను కలిసి కారు గుర్తుకు ఓటేయాలని అభ్యర్థించారు. లక్ష్మారెడ్డితో కలిసి చైతన్యపురి డివిజన్‌లో రోడ్ షో నిర్వహించారు. డివిజన్ అధ్యక్షులు కటికరెడ్డి అరవింద్ రెడ్డి, నాయకులు ముద్దగౌని సుమన్ గౌడ్, సామ బుచ్చిరెడ్డి, పోగుల రాంబాబు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రాగిడి లక్ష్మారెడ్డి

కుత్బుల్లాపూర్‌లో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ ప్రచారం

కుత్బుల్లాపూర్/కూకట్‌పల్లి: మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి గెలిపించాలని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు పిలుపునిచ్చారు. మంగళవారం కుత్బుల్లాపూర్, రంగారెడ్డినగర్, గాజుల రామారం, సూరారం డివిజన్లలో, కొంపల్లి మునిసిపల్‌లో పచారం నిర్వహించారు.

లక్ష్మారెడ్డిని గెలిపించండి

నేరేడ్‌మెట్/అల్వాల్: రాగిడి లక్ష్మారెడ్డిని గెలిపించాలని నేరేడ్‌మెట్‌లో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, కార్పొరేటర్ కొత్తపల్లి మీనా ఉపేందర్‌రెడ్డి బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం మంగళవారం నిర్వహించారు. వెంకటాపురం డివిజన్ శ్రీసాయి ఎన్‌క్లేవ్ కమ్యూనిటీ హాల్‌లో బూత్ లెవల్ కార్యకర్తలతో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి మంగళవారం సమావేశమయ్యారు. లక్ష్మారెడ్డిని గెలుపునకు కృషి చేయాలని సూచించారు.

ఓటు హక్కుపై అవగాహన

వనస్థలిపురం, మే 7 (ఆంధ్ర జ్యోతి): ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని హరిహరపురం కాలనీ సీనియర్ సిటిజన్ అధ్యక్షుడు స్వతంత్రరెడ్డి కోరారు. మంగళవారం ఓటు హక్కుపై అవగాహన ర్యాలీని సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లోక్‌సభ ఎన్నికల్లో అందరూ ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నారాయణ రెడ్డి, డి.విజయ్ భాస్కర్, తులసన్న, రవీంద్ర కుమార్, వనజాక్షి, వెంకటయ్య, రంగనాథం, రవీందర్ రావు తదితరులు పాల్గొన్నారు.


మంగళవారం ఉదయం నాదర్‌గుల్ వార్డు కార్యాలయంలో పోలింగ్ బూత్‌ల వద్ద పరిస్థితి ఇది


సాయంత్రానికి చదును చేయించిన తర్వాత ఇలా..

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నాదర్‌గుల్‌లో పోలింగ్ బూత్‌ల ప్రాంగణంలో

నిర్మాణ సామగ్రి తొలగింపు

సరూర్‌నగర్, మే 7 (ఆంధ్రజ్యోతి): పోలింగ్ తేదీ సమీపిస్తున్న వేళ బాలాపూర్ మండలం(బడంగ్‌పేట్ కార్పొరేషన్)లోని నాదర్‌గుల్ వార్డు కార్యాలయంలో గల పోలింగ్ బూత్‌ల వద్ద అస్తవ్యస్త పరిస్థితులపై.. 'పోలింగ్ బూత్‌ల ప్రాంగణం ఇలా.. ఎన్నికల రోజు ఎలా..!?' అనే శీర్షికతో మంగళవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన వార్తా కథనానికి అధికారులు స్పందించారు. ఈ విషయం జిల్లా కలెక్టర్ దృష్టికి వెళ్లడంతో ఆయన అక్కడి పరిస్థితిని చక్కదిద్ది నివేదిక పంపాల్సిందిగా మహేశ్వరం ఏఆర్వో/కందుకూరు ఆర్డీవోను ఆదేశించారు. దాంతో ఆర్డీవో సూరజ్‌కుమార్ మంగళవారం సాయంత్రం బాలాపూర్ తహసీల్దార్ మాధవీరెడ్డి, బడంగ్‌పేట్ కమిషనర్ రఘునాయక్‌తో కలిసి నాదర్‌గుల్ వార్డు కార్యాలయాన్ని సందర్శించారు. ఓ ఇంటి యజమాని వార్డు కార్యాలయం ఎదుట స్థలాన్ని ఆక్రమించి నిర్మాణం చేస్తుండడాన్ని గమనించారు. ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనం అక్షరసత్యమని గ్రహించిన అధికారులు అక్కడి నుంచి నిర్మాణ సామగ్రిని తొలగించి స్థలాన్ని చదును చేయించారు. పోలింగ్ బూత్‌ల ప్రాంగణాన్ని చదును చేసి ఏఆర్వో సూరజ్‌కుమార్ కలెక్టర్‌కు, సీఈవోకు నివేదిక పంపించారు.

బీజేపీని గెలిపించండి : ఈటల రాజేందర్

కీసర, మే 7 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ అమలు కానీ హామీలు ఇచ్చి రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిందని మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ ఆరోపించారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం కీసరలో రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అబద్ధపు మాటలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ, తిరిగి ప్రజలను మోసం చేసేందుకు వస్తుందన్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలలో మహిళలకు బ్యాంక్ అకౌంట్‌లో రూ. 2,500 వేస్తానని, రైతులకు రుణమాఫీ చేస్తామని, విద్యార్థినులకు స్కూటీ ఇస్తామని, రూ. 4 వేలు పింఛన్ ఇస్తామని చెప్పి రేవంత్‌రెడ్డి మోసపూరితపు మాటలు చెప్పారని అన్నారు. కాంగ్రెస్ మోసపూరిత మాటలు నమ్మొద్దని, కమలం గుర్తుకు ఓటు వేసి బీజేపీని గెలిపించాలని ఆయన కోరారు. సాయంత్రం నుండి ఎడతెరపి లేకుండా వర్షం కురుస్తున్నా పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు రోడ్ షో ముగిసే వరకు కార్యక్రమంలో పాల్గొన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు పటోళ్ల విక్రమ్ రెడ్డి, మండల అధ్యక్షుడు దేశం మల్లేష్ గౌడ్, తిరుమల్‌రెడ్డి, వెకట్‌రెడ్డి, నల్లా వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


కీసరలో రోడ్‌షోలో మాట్లాడుతున్న ఈటల రాజేందర్

మన్సూరాబాద్‌లో కార్పొరేటర్ ప్రచారం

హయత్‌నగర్: మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌ను గెలిపించాలని కోరుతూ మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నరసింహారెడ్డి కోరారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కళ్లెం రవీందర్‌రెడ్డితో కలిసి లెక్చరర్స్ కాలనీ, ఆదిత్యనగర్, టీ నగర్, ఎల్లారెడ్డి కాలనీల్లో మంగళవారం ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో రఘునాథ్‌రెడ్డి, యాదగిరిరావు, చంద్రారెడ్డి, రమేష్, సతీష్, యాదగిరి యాదవ్, కొండల్‌రెడ్డి, పారంద సాయితో పాటు పలువురు పాల్గొన్నారు.

బీజేపీ గెలుపుతోనే దేశం అభివృద్ధి

కూకట్‌పల్లి: బీజేపీ గెలుపుతోనే దేశాభివృద్ధి సాధ్యమని కార్పొరేటర్ కొడిచెర్ల మహేందర్ అన్నారు. మూసాపేట డివిజన్‌లోని ఈడబ్ల్యూఎస్, మూసాపేట గూడ్స్‌షెడ్‌రోడ్డు ప్రాంతాల్లో మంగళవారం ప్రచారం నిర్వహించారు. కమలం గుర్తుకు ఓటేసి ఈటల రాజేందర్‌ను గెలిపించాలని కోరారు. ఈటల రాజేందర్‌కు మద్దతుగా మల్కాజిగిరి కార్పొరేటర్ ఉరపల్లి శ్రవణ్ మంగళవారం ఆర్‌కేనగర్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు.


మన్సూరాబాద్ డివిజన్‌లో ప్రచారం చేస్తున్న కార్పొరేటర్ కొప్పుల నరసింహారెడ్డి

మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ ప్రచారం

రామంతాపూర్: భరత్‌నగర్, శ్రీనగర్ కాలనీలో ఈటల రాజేందర్‌కు మద్దతుగా మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్, రామంతాపూర్ కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్‌రావు మంగళవారం ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేసి కమలం గుర్తుకు ఓటేయాలని కోరారు. రామంతాపూర్ పాలిటెక్నిక్ కళాశాల, హబ్సిగూడ కాకతీయనగర్ పార్కులలో వాకర్స్‌ను మాజీ ఎమ్మెల్యే భేతి సుభాష్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి సతీమణి కావ్య బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు టి. హనుమంతరావు రాజేందర్‌కు మద్దతుగా మంగళవారం ప్రచారం నిర్వహించారు.

ఈటలకు జాతీయ వాయిద్య కళాకారుల సంఘం మద్దతు

మల్కాజిగిరి: ఈటల రాజేందర్‌కు జాతీయ వాయిద్యకళాకారుల సంఘం తన మద్దతు ప్రకటించింది. ఈ మేరకు సంఘం జాతీయ అధ్యక్షుడు చెన్నారావు మంగళవారం మల్కాజిగిరిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈ విషయాన్ని స్పష్టం చేశారు. ఈటల రాజేందర్ గెలుపునకు కళాకారులందరూ కృషి చేస్తారని ప్రకటించారు. ప్రముఖ వాగ్గేయ కళాకారులు టీవీ మోహనకృష్ణ మాట్లాడుతూ.. రాజకీయాలతో సంబంధం లేకుండా అంకిత బావం కలిగిన ఈటలకు మద్దతు ప్రకటిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర బ్యాండ్ కళాకారుల సంఘం అధ్యక్షులు శ్రీనివాస్ హుస్సేన్, సురేష్, నగేష్, లక్ష్మీనారాయణ, కుమార్ తదితరులు పాల్గొన్నారు.


డొక్కా సీతమ్మకు నివాళులర్పిస్తున్న ఉప్పల శ్రీనివాస్‌గుప్తా, మాడభూషి శ్రీధర్

అన్నదాత డొక్కా సీతమ్మ సేవలు ఆదర్శనీయం

వనస్థలిపురం, మే 7 (ఆంధ్రజ్యోతి): నిరంతర అన్నదాత డొక్కా సీతమ్మ సేవలు ఆదర్శనీయమనీ తెలంగాణ టూరిజం కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా అన్నారు. ఆకృతి సంస్థ ఆధ్వర్యంలో నాగోల్ డివిజన్ కో-ఆపరేటివ్ బ్యాంక్ కాలనీలో సీతమ్మ 116 వర్ధంతి మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర సమాచార మాజీ కమిషనర్ మాడభూషి శ్రీధర్, శ్రీనివాస్‌గుప్తా మాట్లాడుతూ.. సీతమ్మ ఆశయ సాధనకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఆకృతి సంస్థ ఛైర్మన్ సుధాకర్, డా.అనంతలక్ష్మి, చేపూరి శంకర్, వేద కళ్యాణి, పద్మజ తదితరులు పాల్గొన్నారు.

దాడిలో గాయపడిన బాధితుడికి పరామర్శ

హైదరాబాద్ సిటీ, మే 7 (ఆంధ్రజ్యోతి): బీఎన్ రెడ్డి సాగర్ కాంప్లెక్స్ వద్ద పండ్లు అమ్మే పాతబస్తీకి చెందిన గంజాయి మూక దాడిలో తీవ్రంగా గాయపడిన గుర్రంగూడకు చెందిన సబావత్ రాజు నాయక్‌ను నిమ్స్‌లో బీజేపీ మహేశ్వరం నియోజకవర్గం ఇన్‌చార్జి అందెల శ్రీరాములు యాదవ్ మంగళవారం పరామర్శించారు. రాజు కుటుంబాన్ని ఆదుకోవాలని, ఆస్పత్రి ఖర్చులు ప్రభుత్వం భరించాలని ఆయన డిమండ్ చేశారు. బాధితుడిని పరామర్శించిన వారిలో బడంగ్‌పేట్ కార్పొరేషన్ అధ్యక్షుడు చెరుకుపల్లి వెంకటరెడ్డి, గుర్రంగూడ కార్పొరేటర్ గడ్డం లక్ష్మారెడ్డి తదితరులు ఉన్నారు.


బాధితుడిని పరామర్శిస్తున్న శ్రీరాములు

'సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయం'

కొత్తపేట, మే 7 (ఆంధ్రజ్యోతి): సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని కొత్తపేట కార్పొరేటర్ పవన్‌కుమార్ అన్నారు. ఎల్‌బీనగర్ ఓబీసీ మోర్చా కార్యదర్శి రింకూసింగ్ గౌర్ అధ్వర్యంలో మోహన్‌నగర్ - నాగోల్ ప్రధాన రహదారిలో మంగళవారం బాటసారులకు మజ్జిగ పంపిణీ శిబిరం ఏర్పాటు చేశారు. పవన్‌కుమార్ శిబిరాన్ని ప్రారంభించి బాటసారులకు మజ్జిగ పంపిణీ చేశారు. శ్రీరామసేవా సమితి మోహన్‌నగర్‌లో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని కూడా ఆయన ప్రారంభించారు. కార్యక్రమాల్లో శ్రీరామసేవా సమితి ప్రతినిధి ఉపేందర్ సింగ్, బీజేపీ డివిజన్ అధ్యక్షులు మంచి రాజేష్, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, సత్యనారాయణ, ప్రవీణ్ తాతా తదితరులు పాల్గొన్నారు.

జలమండలి సిబ్బందికి మజ్జిగ పంపిణీ

వనస్థలిపురం, మే 7 (ఆంధ్రజ్యోతి): జాగృతి అభ్యుదయ సంఘం ఛైర్మన్ భావన శ్రీనివాస్ ఆధ్వర్యంలో వనస్థలిపురంలో జలమండలి సిబ్బందికి ఆయుర్వేద మూలికలతో కూడిన మజ్జిగ, మిల్లెట్ మిఠాయిలను మంగళవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో జలమండలి డీజీఎం రాజగోపాల్, జలమండలి ఉద్యోగులు, తెలంగాణ బ్రాహ్మణ సంఘం నాయకులు మంగపతిరావు, సీహెచ్‌వీఆర్కే మూర్తి తదితరులు పాల్గొన్నారు.

'పీహెచ్‌సీ సేవలను సద్వినియోగం చేసుకోవాలి'

చంపాపేట, మే 7 (ఆంధ్రజ్యోతి): మిధాని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని మిధాని సీఎండీ డాక్టర్ సంజయ్‌కుమార్ ఝా అన్నారు. కంచన్‌బాగ్‌లో మిధాని ప్రాంగణంలో యంపీహెచ్‌సీలో అదనంగా నిర్మించిన భవనంను మంగళవారం ఆయన ప్రారంభించారు. భవిష్యత్‌లో పీహెచ్‌సీలో మరిన్ని సేవలను అందుబాటులోకి తీసుకరానున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మిధాని డైరెక్టర్(ఫైనాన్స్)ఎన్.గౌరీశంకర్‌రావు, డైరెక్టర్ (ప్రొడక్షన్, మార్కెటింగ్) టి.ముత్తుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

మత రాజకీయాలు చేస్తున్న బీజేపీ, ఎంఐఎంలను ఓడిద్దాం :సీపీఐ

సైదాబాద్, మే 7 (ఆంధ్రజ్యోతి): మత రాజకీయాలు చేస్తున్న బీజేపీ, ఎంఐఎం పార్టీలను ఓడిద్దామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఈటి నరసింహ అన్నారు. సింగరేణి కాలనీలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఛాయాదేవి అధ్యక్షతన నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశం మంగళవారం నిర్వహించారు. సెక్యులర్ వ్యవస్థను బలపరిచే ఇండియా కూటమిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు శంకర్ నాయక్, యాదగిరి, స్టాలిన్, ఐఎస్‌సదన్ డివిజన్ కార్యదర్శి మహమూద్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఈటి నరసింహ

బీజేపీలో పలువురి చేరిక

హైదరాబాద్ సిటీ, మే 7(ఆంధ్రజ్యోతి): మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌కు చెందిన 6వ డివిజన్ కార్పొరేటర్ మమతాప్రవీణ్ తన అనుచరులతో బీజేపీలో చేరారు. వారికి బీజేపీ చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గం అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి బంజారాహిల్స్‌లో తన నివాసంలో కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. చేవెళ్ల నియోజకవర్గం పాల్గుట్ట గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్, బీఆర్ఎస్ కార్యకర్తలు బీజేపీ సీనియర్ నాయకుడు వెంకటరెడ్డి ఆధ్వర్యంలో చేరగా, వారికి విశ్వేశ్వర్ రెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందెల శ్రీరాములు యాదవ్, కొలన్ శంకర్ రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ దేవేందర్ రెడ్డి, మీర్‌పేట మున్సిపల్ అధ్యక్షుడు పెండ్యాల నరసింహ, బడంగ్‌పేట మున్సిపల్ అధ్యక్షుడు వెంకట్ రెడ్డి, కార్పొరేటర్లు నీలా రవి నాయక్, శ్రవణ్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


కార్పొరేటర్ మమతకు కండువా కప్పుతున్న కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

'ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయాలి'

సంతోష్‌నగర్, మే 7 (ఆంధ్రజ్యోతి): కేంద్ర మెట్ట వ్యవసాయ పరిశోధన సంస్థ(క్రీడా-ఐసీఏఆర్)లో వర్షపు నీటి సంరక్షణ మరియు వినియోగానికి సంబంధించి ఒకరోజు వర్క్‌షాప్ మంగళవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఐసీఏఆర్ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ అఫ్ రైస్ రీసెర్చ్ హైద్రాబాద్ (ఐఐఆర్ఆర్) డైరెక్టర్ డాక్టర్ మీనాక్షి సుందరం పాల్గొన్నారు. ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసి వర్షపు నీటిని సంరక్షించాలన్నారు. భారత ప్రభుత్వం ప్రారంభించిన మిషన్ లైఫ్ యొక్క లక్ష్యాలను సాధించడానికి వర్షపు నీటి సంరక్షణ దాని వినియోగం పై వివరించారు. కార్యక్రమంలో ఆన్‌లైన్ ద్వారా 230 మంది, భౌతికంగా 150 మంది విద్యార్థులు, క్రీడా డైరెక్టర్ డా.వి.కెసింగ్ పలువురు శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు



మలక్‌పేట శ్రీవాణి మహిళ డిగ్రీ కళాశాల విద్యార్థినుల ఫేర్‌వెల్ డే మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థినులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్, సెక్రటరీ సుభాష్‌గౌడ్, ఛైర్మన్ రాజేశ్వర్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ అనుపమ తదితరులు పాల్గొన్నారు.

-చాదర్‌ఘాట్, ఆంధ్రజ్యోతి


ఫుట్‌పాత్‌పై షెడ్లను తొలగిస్తున్న మునిసిపల్ సిబ్బంది

ఫుట్‌పాత్‌పై షెడ్ల తొలగింపు

వనస్థలిపురం, మే 7 (ఆంధ్ర జ్యోతి): బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ సాగర్ కాంపెక్స్‌లో ఫుట్ పాత్‌లపై అక్రమంగా ఏర్పాటు చేసిన షెడ్లను కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి ఫిర్యాదు మేరకు మునిసిపల్ అధికారులు మంగళవారం తొలగించారు. ఫుట్‌పాత్‌లను ఆక్రమించి వ్యాపారాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బీజేపీ రాస్తారోకో

సాగర్ కాంప్లెక్స్ ఫుట్ పాత్‌లపై అక్రమంగా ఏర్పాటు చేసిన పండ్ల షెడ్లను శాశ్వతంగా తొలగించాలనీ బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి, కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి డిమాండ్ చేశారు. ఇటీవల సాగర్‌కాంప్లెక్స్‌లో ఇరువర్గాల మధ్య జరిగిన దాడిలో ఓ వ్యక్తి ప్రాణాపాయ స్థితికి ప్రధాన కారణం పండ్ల వ్యాపారులేనంటూ మంగళవారం రాస్తారోకో నిర్వహించారు. దాడిచేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రాస్తారోకో చేస్తున్న సామ రంగారెడ్డి, కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డితో పాటు బీజేపీ శ్రేణులను పోలీసులు అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. అనంతరం సొంత పూచీకత్తుపై విడిచిపెట్టారు. బీజేపీ శ్రేణుల రాస్తారోకో వల్ల నాగార్జునసాగర్ రహదారిపై ట్రాఫిక్ జామ్‌తో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

పోక్సో కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలు

సైదాబాద్, మే 7 (ఆంధ్రజ్యోతి): చిన్నారిపై లైంగిక దాడి కేసులో నిందితుడికి పోక్సో కోర్టు 20 ఏళ్ల జైలు శిక్ష విధించింది. మాదన్నపేట ఇన్‌స్పెక్టర్ బి. శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. మాదన్నపేట ఈద్గా సమీపంలో ఉంటున్న ఆటో డ్రైవర్ మహ్మద్ సలీం(45) 2020లో ఎనిమిదేళ్ల చిన్నారిపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాలిక కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. కేసు దర్యాప్తు ప్రారంభించి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. మంగళవారం కేసును విచారించిన స్పెషల్ సెషన్స్ పోక్సో కోర్టు న్యాయాధికారి పి. పుష్పలత నిందితుడు సలీంకు 20 ఏళ్ల జైలు శిక్ష, వెయ్యి రూపాల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

పాత నేరస్థుడి అరెస్ట్.. 15 ద్విచక్రవాహనాలు స్వాధీనం

చాదర్‌ఘాట్, మే 7 (ఆంధ్రజ్యోతి): జల్సాలకు అలవాటు పడి ద్విచక్రవాహనాలను చోరీ చేస్తున్న పాత నేరస్థుడిని చైతన్యపురి క్రైం పోలీసులు అరెస్ట్ చేశారు. అతడి నుంచి 15 ద్విచక్రవాహనాలు, ఆటోను స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏసీపీ కృష్ణయ్య వివరాలు వెల్లడించారు. వనస్థలిపురం అభ్యుదయనగర్ నివసిస్తున్న నల్లగొండ నివాసి పగడాల గణేష్(28) కారు డ్రైవర్. జల్సాలకు అలవాటు పడడంతో సులభంగా డబ్బులు సంపాదించాలనుకున్నాడు. తాళాలు వేసిన పలు ఇళ్లలో దొంగతనాలు చేస్తూ పట్టుబడి జైలుకు వెళ్లాడు. జైలు నుంచి వచ్చిన తర్వాత ద్విచక్రవాహనాలు చోరీ చేశాడు. కేసు దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు సీసీ ఫుటేజీలను పరిశీలించగా.. చోరీలకు పాల్పడింది పాత నేరస్థుడు పగడాల గణష్ అని తేలడంతో అతడిని అరెస్ట్ చేసి వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.

సీబీఐ అధికారులమంటూ రూ. 91.64 లక్షలు దోచేశారు

హైదరాబాద్ సిటీ, మే 7 (ఆంధ్రజ్యోతి): సీబీఐ అధికారులుగా పరిచయం చేసుకున్న సైబర్ నేరగాళ్లు 'మీ బ్యాంకు ఖాతాల నుంచి విదేశాలకు హవాలా డబ్బు వెళ్లింది' అని బెదిరించి నగరవాసి నుంచి రూ. 91.64 లక్షలు కాజేశారు. నగరానికి చెందిన 74ఏళ్ల వ్యక్తికి సైబర్ నేరగాళ్లు ఫోన్ చేసి, ఫెడెక్స్ కొరియర్ సర్వీస్‌లో మీ పేరున బ్యాంకాక్ నుంచి థాయ్‌లాండ్‌కు పంపిన పార్శిల్ అడ్రస్ సరిగాలేని కారణంగా తిరిగి వచ్చిందని చెప్పారు. అందులో పాస్‌పోర్టులు, బ్యాంకు పాస్‌పుస్తకాలు, 140 గ్రాముల ఎండీఎంఏతో పాటు, 4 కిలోల దుస్తులు ఉన్నాయని చెప్పారు. దీనిపై కేసు నమోదైందని చెప్పారు. కొద్దిసేపటి తర్వాత వీడియో కాల్ చేసిన సైబర్ నేరగాడు సీబీఐ అధికారిగా పరిచయం చేసుకున్నాడు. 'మీ ఆధార్‌కు అనుసంధానమైన ఖాతాల నుంచి విదేశాలకు 66.88 మిలియన్ల డాలర్ల హవాలా డబ్బు వెళ్లిందని, ఇందులో కొంత మొత్తం బ్యాంకాక్ పోలీసులు సీజ్ చేశారు. మీపై కేసు నమోదైందని, ఏక్షణంలోనైనా అరెస్టయ్యే అవకాశముంది' అని బెదిరించాడు. 'మీ ఖాతాల్లో ఉన్న డబ్బు ఏ మార్గాల్లో వచ్చిందో పరిశీలించి దానికి సంబంధించి సీబీఐ అధికారులు సర్టిఫికెట్ ఇస్తారు' అని చెప్పాడు. అందుకోసం 'మీ దగ్గర ఉన్న డబ్బును సీబీఐ ఖాతాకు బదిలీ చేయాలి' అని సూచించాడు. నమ్మకం కలిగించేందుకు సీబీఐ లెటర్‌హెడ్‌ను చూపించాడు. దాంతో తన ఖాతాలో ఉన్న రూ. 91.64 లక్షలు సైబర్ నేరగాడు సూచించిన ఖాతాలోకి పంపాడు. తర్వాత ఫోన్‌లు స్విచ్ఛాఫ్ రావడంతో మోసపోయానని గ్రహించి సైబర్‌క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.